
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



శిలువ పాదయాత్ర

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో తపస్సు కాలం సందర్భంగా గురువారం మరియ, యేసోబు దేవాలయం నుంచి బాలయేసు పుణ్యక్షేత్రం వరకు విశ్వాసులు శిలువ పాదయాత్ర నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 515.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైద్యశాలలో అన్నదానం

మాచర్లరూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం అన్నదానం నిర్వహించారు. కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు గవర్నర్ అబ్దుల్ నజీర్ చీరాల రాక

చీరాల టౌన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం చీరాల వస్తున్నారని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు గురువారం తెలిపారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటనకు వస్తున్నారని రాజ్ భవన్ నుంచి సమాచారం అందడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు గవర్నర్ వాడరేవులోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకుని బస చేస్తారని, శనివారం విజయవాడ రాజ్‌భవన్‌కు ప్రయాణమవుతారని సమాచారం అందించారు. ఈ మేరకు ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్ వ్యక్తిగత పర్యటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఎయిమ్స్‌లో కార్డియాక్ ఐసీయూ విభాగం ప్రారంభం

గుండె జబ్బు రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు



మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్‌లో గురువారం నూతనంగా కార్డియాక్ ఐసీయూ విభాగాన్ని ప్రారంభించారు. ఇప్పటికే కార్డియాక్ విభాగంలో యాంజియోప్లాస్టీతో పాటు అన్ని రకాల సేవలందుతున్నాయి. అయితే, ఐసీయూ విభాగం లేకపోవడంతో గుండె సంబంధిత రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. గుండె సంబంధిత రోగులకు అన్ని రకాల వైద్య సేవలతో ఐసీయూ విభాగం అందుబాటులోకి రావడంతో రోగులకు ఎంతో మేలు జరుగుతుందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

కుడికాలువకు నీటి విడుదల నిలుపుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు గురువారం నీటిని నిలుపుదల చేశారు. సాయంత్రం 4 గంటలకు నీటిని అధికారులు పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 515.30 అడుగుల వద్ద ఉంది. ఇది 140.8451 టీఎంసీలకు సమానంగా ఉంది. ఇక్కడ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 841 క్యూసెక్కులు విడుదలవుతుంది.

దుర్గమ్మ సన్నిధిలో ఎన్నికల కమిషనర్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీ, తెలంగాణ ఎన్నికల కమిషనర్లు గురువారం దర్శించుకున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఇంద్రకీలాద్రికి విచ్చేయగా ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలతో వారిని సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన డి. మాల్యాద్రి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,11,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ అధికారి లక్ష్మణ్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

‘పచ్చ’పాతం.. ప్రభలం



- వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై వివక్ష
- బల్లికురవ మండలంలో ఈర్లగంగమ్మ తిరునాళ్ల
- ప్రభలు పెట్టుకునేందుకు అనుమతి కోరిన ఇరుపార్టీల నేతలు
- పచ్చపార్టీ వారికే అనుమతులిచ్చిన ఎస్‌ఐ నాగరాజు
- ఎస్‌ఐ మాటే మా మాట అంటున్న ఉన్నతాధికారులు
- నాలుగు రోజులముందు అనుమతి ఇచ్చి బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ
- నాగరాజు విధుల్లో చేరగానే అనుమతి రద్దు
- ఎస్‌ఐ నాగరాజును హుటాహుటిన బల్లికురవకు తెచ్చిన మంత్రి అనుచరులు
- వేమవరం జంటహత్యల కేసు రాజీ కోసమేనన్న ప్రచారం
- గతంలో బల్లికురవ ఎస్‌ఐగా పనిచేసిన నాగరాజు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి పాలనలో కొందరు పోలీసు అధికారులు మరింతగా రెచ్చిపోతున్నారు. అధికారపార్టీ నేతల అండచూసుకొని పెట్రేగిపోతునారు. ఖాకీ చొక్కాలపై పచ్చకండువాలు కప్పుకొని విర్రవీగుతున్నారు. నిన్న అనంతపురం జిల్లా రామగిరి ఎస్‌ఐ సుధాకర్ ఏకంగా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనే నోరుపారేసుకుంటే తాజాగా బాపట్ల జిల్లా బల్లికురవ ఎస్‌ఐగా సోమవారం విధుల్లో చేరిన నాగరాజు వైఎస్సార్ సీపీ నేతలు పోలీసు స్టేషన్ ఆవరణలోకి కూడా రావద్దంటూ హుకుం జారీ చేశారు. పబ్లిక్ సర్వెంట్‌గా వున్న ఎస్‌ఐ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతుండగా విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వారు స్పందించడం లేదు. ఎస్‌ఐ తీరుతో బల్లికురవ ప్రాంతంలో మళ్లీ ఫ్యాక్షన్ గొడవలు తలెత్తే ప్రమాదముందని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పసుపు చొక్కాలకు పోలీసుల సెల్యూట్



నక్కబొక్కలపాడు వద్ద పచ్చపార్టీ జెండాలతో ప్రభల ఏర్పాటు

వేమవరం హత్యకేసు రాజీ కోసమే..

ఇదే మండలం వేమవరంలో 2017లో మేనెల 18న కరణం బలరామకృష్ణమూర్తి అనుచరులు గోరంట్ల అంజయ్య, వేగినేని రామకోటేశ్వరరావులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుచరులు 13 మంది కలిసి పథకం ప్రకారం హత్యచేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ దాడిలో గోరంట్ల వెంకటేశ్వర్లు, వేగినేని వీరరాఘవయ్య తీవ్ర కత్తిపోట్లకు గురై కొన ప్రాణంతో బయటపడ్డారు. ఆరోజు నుంచి ఈ రోజువరకూ వేమవరంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. ప్రస్తుతం కేసు చివరిదశకు చేరుకుంది. బాధితులు హత్యచేసిన వారికి శిక్ష పడాల్సిందేనని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే మంత్రి గొట్టిపాటి అనుచరులకు శిక్షపడే అవకాశం లేకపోలేదు. దీంతో ఈ కేసులో బాధితులను బెదిరించైనా సరే బయటపడేందుకు మంత్రి అనుచరులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే 2017 ప్రాంతంలో బల్లికురవ ఎస్‌ఐగా పనిచేసిన నాగరాజును తిరిగి ముండ్లమూరు నుంచి హుటాహుటిన బల్లికురవ స్టేషన్‌కు పిలిపించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

అనుమతులు ఉన్నా..

వాస్తవానికి వైఎస్సార్ సీపీ నేతలు వారం క్రితం బల్లికురవ ఎస్‌ఐ జీవీ చౌదరికి దరఖాస్తు చేసుకోగా ఆయన సంతమాగులూరు సీఐ కలిసి ప్రభలకోసం అనుమతి ఇచ్చారు. ఈ విషయం డీఎస్పీకి సైతం తెలుసు. ఇదే విషయాన్ని వైఎస్సార్ సీపీ నేతలు డీఎస్పీ దృష్టికి తీసుకరాగా అనుమతి తాను పంపిస్తానని ఎస్‌ఐని కలువాలని చెప్పడంతో వారు తిరిగి బల్లికురవ ఎస్‌ఐని కలువగా ఎవరు చెప్పినా అనుమతి ఇవ్వనని తేల్చి చెప్పారు. మంత్రి అనుచరుల అండతో ఎస్‌ఐ డీఎస్పీ మాటలను సైతం ఖాతరు చేయలేదని తెలుస్తోంది. దీంతో గురువారం సైతం వైఎస్సార్ సీపీ నేతలు మరోమారు డీఎస్పీని కలువగా తాను ఎస్‌ఐ చెప్పిన ప్రకారమే నడుచుకుంటామని చెప్పడం అందరినీ నివ్వెరపరిచింది. అదే సమయంలో పార్టీలు, జెండాలకతీతంగా తిరునాళ్లు నిర్వహించుకోవాలని, పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు కడితే కేసులు పెడతామని చెప్పినా పచ్చపార్టీవారు మాత్రం ప్రభల ప్రాంతంలో ఏకంగా టీడీపీ జెండాలు, నేతల ఫొటోలు ఏర్పాటు చేశారు. పచ్చపార్టీ వారికి మాత్రమే ఎస్‌ఐ అనుమతులివ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆది నుంచి వివాదాస్పదమే..

బల్లికురవ ఎస్‌ఐ నాగరాజు పనితీరు మొదటి నుంచీ వివాదాస్పదమే. సోమవారం ఆయన మరోమారు బల్లికురవ ఎస్‌ఐగా విధుల్లో చేరీచేరడంతోనే వైఎస్సార్ సీపీ శ్రేణులే టార్గెట్‌గా వ్యవహరిస్తున్నారు. మండలంలోని నక్కబొక్కలపాడులో ఈర్ల గంగమ్మ జాతర సందర్భంగా ప్రభల అనుమతుల విషయంలోనూ ఏకపక్షంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఈ నెల 12న జాతర వున్నా గురువారం నుంచే ఈ ప్రాంతంలోని నక్కబొక్కలపాడుతోపాటు కొనిదెన, మల్లాయిపాలెం తదితర గ్రామాల్లో తిరునాళ్లు మొదలయ్యాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రభలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ప్రభలు కట్టుకునేందుకు ఇరుపార్టీ మద్దతు దారులు అనుమతికోసం పోలీసులకు దరఖాస్తుచేయగా పచ్చపార్టీ వారికి 6 ప్రభల ఏర్పాటుకు అనుమతులిచ్చిన ఎస్‌ఐ నాగరాజు వైఎస్సార్ సీపీ వారికి అనుమతి నిరాకరించారు. ఇక నుంచి స్టేషన్‌లోకి రావద్దని వైఎస్సార్ సీపీ వారికి హుకుం జారీ చేశారు. మీరు ఎవరికి చెప్పుకున్నా అనుమతి ఇచ్చేదిలేదన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్ణ తదితరులు బాపట్ల డీఎస్పీని కలిసి విషయం చెప్పారు.

అభివృద్ధి పనులు సత్వరం పూర్తిచేయాలి

బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



బాపట్లటౌన్: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో దిశ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీ టి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన పనులు సత్వరం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాబోయే సంవత్సరంలో 76 లక్షల పని దినాలను కూలీలకు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రహదారుల మరమ్మతులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జిల్లాలో అమృత ధార మెగా ప్రాజెక్ట్ కోసం రూ.3500 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. కలెక్టర్ జె. వెంకటమురళి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరు చేసిన అభివృద్ధి పనులు పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. తాగునీటి పథకాల మరమ్మతుల కోసం జల జీవన్ మిషన్ కింద 400 పనులు రూ.149 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, ప్రకాశం జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓ బోసు, డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డీపీఓ ప్రభాకర్, హౌసింగ్ పీడీ వై.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గ్రూపులు.. ఘర్షణలు.. కేసులు

మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తీరు

- వైద్యుడిపై బయట వ్యక్తులతో కలిసి నర్సు దాడి
- పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు
- గతవారం నైట్ వాచ్‌మెన్‌పై నర్సు చెప్పుతో దాడి!
- మంట కలుస్తున్న ఆస్పత్రి ప్రతిష్ట

మార్టూరు: పేద రోగులకు సేవలందించాల్సిన ప్రభుత్వాసుపత్రి నిత్యం ఘర్షణలు, గ్రూపులకు వేదికగా మారింది. ప్రజలకు మాదిరిగా ఉంటూ సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అనైతిక పనులకు పాల్పడుతూ ఆస్పత్రి పరువును బజారుకీడుస్తున్నారు. మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది రోగులకు సేవ చేయడం మానేసి గ్రూపులుగా ఏర్పడి నిత్యం ఘర్షణలు పడటం స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. పలువురు వివాహేతర సంబంధాలతో ఆస్పత్రిని పరువును బజారుకీడుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత రెండు రోజులుగా ఆసుపత్రిలో జరుగుతున్న సంఘటనలు ఇందుకు అద్దం పడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...

వాట్సాప్ మెసేజ్ లీక్.. వాచ్‌మెన్‌పై దాడి!

ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతి పై పనిచేసే వైద్యుడితో ఆసుపత్రిలోని ఓ నర్సు గతంలో బాగానే ఉండేవారు. ఇటీవల ఇద్దరి మధ్య అంతగా సఖ్యత లేదు. ఈ క్రమంలో గతవారం నర్స్ సెల్‌ఫోన్‌కు ఆసుపత్రికి చెందిన మరో వైద్యుడు పంపిన వాట్సాప్ మెసేజ్ ఆసుపత్రి నైట్ వాచ్‌మెన్ అయిన ఓ యువకుడి ద్వారా లీకై ఆసుపత్రి సిబ్బంది వద్ద వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణు తేజ నర్సుకు మెసేజ్ పంపిన వైద్యుడితో కలిసి ఆసుపత్రి పైన గల తన రూముకు రావాల్సిందిగా బుధవారం ఉదయం నైట్ వాచ్‌మెన్‌కు కబురు పెట్టారు. సూపరింటెండెంట్ మాటలు నమ్మి పైకి వెళ్లిన నైట్ వాచ్‌మెన్‌ను అప్పటికే ఇద్దరు వైద్యులతో కలిసి తలుపు చాటున అదేరూములో ఉన్న నర్సు ఒక్కసారిగా వాచ్‌మెన్‌పై చెప్పుతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టింది. ఇంత జరుగుతున్నా ఇద్దరు వైద్యులు నర్సును కనీసం అడ్డుకోకపోవడం గమనార్హం. ఇద్దరు వైద్యులు దగ్గరుండి మరీ వాచ్‌మెన్‌పై దాడి చేయించారంటూ ఆసుపత్రికి చెందిన మిగిలిన వైద్యులు, సిబ్బంది ఆరోపించటం గమనార్హం.

వైద్యుడిపై నర్సు దాడి.. పరస్పరం ఫిర్యాదులు

ఇదిలా ఉండగా గురువారం ఉదయం పిల్లల వైద్యుడు ఆసుపత్రి ఓపీ వద్ద విధులలో ఉండగా సదరు నర్సు చీరాల నుంచి తన ఇద్దరు సోదరులతో వచ్చి విచక్షణారహితంగా ఆ వైద్యుడిపై దాడి చేసి అతని సెల్ఫోన్ లాక్కున్నారు. నర్స్ దాడిలో గాయపడిన వైద్యుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనపై జరిగిన దాడిని వివరిస్తూ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరుపక్షాల పరస్పర ఫిర్యాదులను పరిశీలించడం కోసం ఇద్దరిని స్టేషన్‌కు పిలిపించారు.

■ ఇదిలా ఉండగా ఇటీవల ఆసుపత్రి ప్రాంగణంలో వినియోగించిన కండోమ్ బయటపడటం స్థానికంగా కలకలం రేపింది. 30 పడకల ఆసుపత్రి అయినప్పటికీ సగం భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం 15 పడకలతోనే ఆసుపత్రిని నిర్వహిస్తుండగా రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది చాలదన్నట్లుగా ఆసుపత్రిలోని సీనియర్ వైద్యులే కులాలను రెచ్చగొడుతూ గ్రూపులను ప్రోత్సహించటం సిబ్బందికి విధులు కేటాయించడంలో వివక్ష చూపటం సిబ్బందిలో అభద్రతాభావం పెరగటానికి కారణమైంది. ఆసుపత్రిలో పరిస్థితుల గురించి వైద్య విధానపరిషత్ కు చెందిన జిల్లా అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోకపోవడం పరిస్థితి ఇంతవరకు వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకుని ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా ఉండేట్లు చూడాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

చీరాలలో ఇసుక తోడేళ్లు!

- ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ
- నియోజకవర్గ ముఖ్యనేతకు నెలకు రూ. 30 లక్షలు కప్పం!
- అసైన్డ్ భూముల్లో భారీగా తవ్వకాలు
- రోజుకు 100 ట్రాక్టర్లు, 50 టిప్పర్లతో పగలు, రాత్రి రవాణా
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు



ఇసుక తరలింపుతో భారీగా ఏర్పడిన గుంటలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికార పార్టీ నాయకుడు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నాడు. చీరాల నియోజవర్గంలో ఇసుక అక్రమ తరలింపు కోసం కర్లపాలెం మండలం యాజిలికి చెందిన ఓ పచ్చ నాయకుడు రూ. 30 లక్షలకు పాట పాడుకున్నాడు. ప్రతి నెల చీరాల నియోజకవర్గం నుంచి అక్రమంగా ఇసుక తరలించుకోవడానికి టీడీపీ నియోజకవర్గ ముఖ్య నేతకు ఈ కప్పం కడుతున్నాడు. ఉచితం మాటున యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ అక్రమ తరలింపు వ్యవహారం తెలిసినా డ్రైనేజీ, రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులకు నెలనెలా మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

నిత్యం వందల సంఖ్యలో తరలింపు..

చీరాల నియోజవర్గం పరిధిలో ప్రధానంగా వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి, రామన్నపేట, సముద్రతీర గ్రామాల పరిధిలో అసైన్డ్ భూముల నుంచి పొక్లెయిన్‌లతో ఇసుక తవ్వి ట్రాక్టర్లు, లారీ టిప్పర్లతో నూతనంగా నిర్మిస్తున్న వాడరేవు – పర్చూరు జాతీయ రహదారి మీదుగా నూతనంగా వేసే లేఅవుట్‌లకు నిత్యం వంద సంఖ్యలో ఇసుక లోడులు తరలిస్తున్నారు. ప్రతిరోజూ 100 నుంచి 150 లోడ్లు వరకు డంప్ అవుతున్నాయి. ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. టిప్పర్ ఇసుక క్వాలిటీని బట్టి రూ. 25వేల నుంచి రూ. 40 వేల వరకు విక్రయిస్తున్నారు.

వీళ్లే కీలకం...

పందిళ్లపల్లికి చెందిన టీడీపీ చెందిన మరో ముగ్గురు ఇసుక మాఫియా సిబ్బందిని యాజిలికి చెందిన పచ్చనాయకుడు ఏర్పాటు చేసుకున్నాడు. వీరు ముగ్గురు ఈ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలించి డబ్బులు వసూలు చేసి ఆ నేతకు చెల్లిస్తుంటారు. చీరాల ప్రాంతంలో తాను మినహా వేరెవరూ ఇసుకను విక్రయించేందుకు వీలులేదని సదరు పచ్చనేత హుకుం జారీ చేయడంతో చీరాల ప్రాంతంలో ఇతని ఇసుక వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. మిగిలిన వారికి ఇసుక దిబ్బలు ఉన్నా అమ్ముకోవడానికి వీలులేదు. కాదూ కూడదని తరలించే ప్రయత్నం చేస్తే వెంటనే తహసీల్దార్, పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేయిస్తారు. ఇసుక మాఫియా నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా..

పందిళ్లపల్లి శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని యానాది కాలనీకి చెందిన ఎస్టీ వర్గీయులు జాతీయ ఎస్టీ కమిషన్‌కి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్టీ కమిషనర్ కోర్టులో విచారణ జరుగుతుంది. అయినప్పటికీ పట్టించుకోని ఇసుక మాఫియా భారీస్థాయిలో గుంటలు తవ్వి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

గత నెలలో పందిళ్లపల్లికి చెందిన ఒక ప్రైవేట్ వ్యక్తి తన సొంత పొలం నుంచి తన ట్రాక్టర్ లో ఇసుక తరలించుకుంటుండగా గమనించిన ఇసుక మాఫియా నాయకులు బైపాస్ రోడ్డులో ట్రాక్టర్‌ని అడ్డుకున్నారు. దీని పై ట్రాక్టర్ యజమాని మీరెవరు నా ట్రాక్టర్‌ని ఆపడానికి

మాఫియాకి కొమ్ముకాస్తున్న ఖాకీలు!

ప్రభుత్వ ఉద్యోగులా లేకా పోలీసులా అని నిలదీయడంతో చేసేది లేక మాఫియా నాయకులు వేటపాలెం ఎస్ఐకి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు హుటాహుటిన ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ విషయానికి సంబంధించి ట్రాక్టర్ యజమాని



ప్రైవేట్ వ్యక్తులు ఇసుక తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించిన ట్రాక్టర్లు

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఎస్పీ ట్రాక్టర్‌ని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన కానిస్టేబుల్ కోటేశ్వరరావుని విధుల నుంచి తప్పించి వీఆర్‌కి పంపించారు. ఈ విషయంలో ఎస్ఐ చాకచక్యంగా తప్పుకోవడం గమనార్హం.

అధైర్యపడొద్దు.. న్యాయం చేస్తాం

విజయపురి సౌత్: మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో గురువారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పర్యటించారు. స్థానికంగా నివాసం ఉంటున్న అరికట్ల బ్రహ్మారెడ్డి, విజయలక్ష్మి వృద్ధ దంపతులు ఇటీవల తమ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో, వారి ఇంటికి వెళ్లిన ఎస్పీ వివరాలు తెలుసుకున్నారు. ఆస్తులను అమ్మి తమ కొడుకు అంజిరెడ్డిని ఉన్నత చదువులు చదివించడంతో యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డాడని, అప్పటినుంచి తమను పట్టించుకోవడం మానేశాడని ఎస్పీ వద్ద వృద్ధ దంపతులు వాపోయారు. అనారోగ్యంతో బాధపతున్నా కొడుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇల్లు గడవక, అనారోగ్యంతో బాధపడలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు ఎస్పీకి తెలిపారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో కేసు వేస్తే భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు చెప్పిందన్నారు. కోర్టు ఆదేశాలను కూడా తమ కొడుకు పాటించలేదని ఎస్పీ కి తెలిపారు. ఎస్పీ స్పందిస్తూ.. న్యాయం చేస్తానని ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎస్పీ వెంట మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ మహమ్మద్ షఫీ ఉన్నారు.

‘హ్యాకింగ్’ చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



నగరంపాలెం: జిల్లా ప్రజలకు సైబర్ మోసాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం హ్యాకింగ్ సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. హ్యాకర్ల సైబర్ నేరాలపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకులు నరేష్ దోనె, మణివరన్ తెలిపారు. ఇటీవల వచ్చిన ఏఐ ద్వారా ఫొటో ద్వారా కూడా సరికొత్త సైబర్ నేరాలను హ్యాకర్లు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు వీటి బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలను చిత్రం ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు. అంజలి సమర్పణలో అనుపమ ఆర్ట్స్ పతాకంపై రావూరి సురేష్‌బాబు చిత్రం నిర్మిస్తున్నారని చెప్పారు. కొన్ని సన్నివేశాలను కొండవీడులో చిత్రీకరించామని, నటిగా ముంబైకు చెందిన కావ్య దేశాయ్ నటిస్తున్నట్లు వారు తెలిపారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ తరగతులు

నెహ్రూనగర్: మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ కోసం గుంటూరు జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు 10వ తరగతి, టీటీసీ, బీఎడ్, టెట్ మార్కు లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణలు, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేసి రాజాగారితోటని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 0863-2358071 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో పర్చూరు నేతలకు స్థానం



పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజక వర్గం లోని పలువురు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జిల్లా కమిటీలో స్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఆదేశాలు అందాయి. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పఠాన్ కాలేషావలి, ప్రధాన కార్యదర్శిగా కొండూరు గోవింద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా దండా చౌదరి, కోట శ్రీనివాసరావు, కార్యదర్శులుగా పి.రామకృష్ణారెడ్డి, పాలేరు వీరయ్యలు నియామకం కాగా జిల్లా అధికార ప్రతినిధిగా బండారు ప్రభాకరరావు నియమితులయ్యారు.

14న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం కోనంకి గ్రామంలో ఏప్రిల్ 14వ తేదీ జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన అభ్యర్థులు రూ.999 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. పోటీలో పాల్గొనే టీం సభ్యులు ఎవరు కిట్టు వారే తెచ్చుకోవాలని, బాల్ కమిటీ వారి వద్దే కొనుగోలు చేయాలని, ప్రతి మ్యాచ్లో 12 ఓవర్లు ఉంటాయని, ఒక జట్టులో ఆడిన సభ్యుడు మరొక జట్టులో ఆడరాదని వారు తెలిపారు. పోటీలో విజేతలైన మూడు టీం లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30,116 రూ.20,116, రూ.10,116లు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 6303974120 నంబర్లో సంప్రదించాల్సిందిగా తెలిపారు.

అద్దంకి కమిషనర్‌కు బెస్ట్ కలెక్షన్ అవార్డు

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపాలిటీ జిల్లాలో అత్యధికంగా పన్ను వసూళ్లలో విశేషంగా కృషి చేసిన కమిషనర్ రవీంద్ర గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ చేతుల మీదుగా బెస్ట్ కలెక్షన్ అవార్డుతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

జాతీయ అవార్డుకు విద్యాశాఖాధికారి ఎంపిక

పెదకూరపాడు: పెదకూరపాడు అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న ఏకుల ప్రసాదరావు 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు'కు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య గురువారం తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రసాదరావు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుచేశారు. ఈ నెల 13వ తేదీన గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావును పలువురు ఉపాధ్యాయులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

సమస్యలను చట్టప్రకారం పరిష్కరించుకోండి

- ఘర్షణలకు చోటివ్వవద్దు
- సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలి
- గవినివారిపాలెం గ్రామస్తులతో ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: గ్రామాలన్నీ ప్రశాంతంగా ఉండాలి.. సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురండి..గొడవలు, హత్యాయత్నాలకు తావివ్వకుండా పెద్దలు హుందాగా వ్యవహరించాలని ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు సూచించారు. గురువారం రాత్రి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఇటీవల గవినివారిపాలెంలో జరిగిన గొడవలు, హత్యాయత్నం ఘటనల నేపద్యంలో పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో గ్రామస్తులతో కలిసి పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గవినివారిపాలెంలో జరిగిన ఘర్షణలకు గల కారణాలను గ్రామస్తుల నుంచి, ఫిర్యాదుదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతు...ప్రశాంత వాతావరణానికి గ్రామాలు కీలకంగా ఉండాలే కానీ గొడవలు, హత్యాయత్నాలు, ఘర్షణలకు తావివ్వకూడదన్నారు. గ్రామంలోని ప్రజల మధ్య ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే ప్రభుత్వ అధికారులైన పోలీస్, రెవెన్యూ, అధికారుల దృష్టికి తీసుకురావాలే కానీ వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు పాల్పడటం చట్ట వ్యతిరేకమన్నారు. అధికారులు అందరు ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నారని సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేస్తారని గుర్తుంచుకోవాలన్నారు. గొడవలకు పాల్పడినా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉండేలా పీస్ కమిటీ పనిచేయాలన్నారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, తహసీల్దార్లు కె.గోపికృష్ణ, జె.ప్రభాకరరావు, రూరల్ సీఐ శేషగిరిరావు, రూరల్ ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, గవినివారిపాలెం గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వసూళ్ల పేరిట వేధింపులకు గురిచేస్తే చర్యలు

- బాపట్ల పట్టణ సీఐ రాంబాబు
- ప్రైవేటు బ్యాంకర్లు, ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ రాంబాబు

బాపట్లటౌన్: ఫైనాన్స్ సొమ్ము వసూళ్ల పేరుతో వేధింపులకు పాల్పడితే సహించేది లేదని పట్టణ సీఐ రాంబాబు హెచ్చరించారు. బాపట్ల పట్టణం, రూరల్ పరిధిలోని మైక్రో ఫైనాన్స్, ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ వ్యాపారాల నిర్వాహకులు, రికవరీ ఏజెంట్లతో పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ ఫైనాన్స్ వసూళ్ల పేరుతో లోన్లు తీసుకున్న వాళ్లను వేధింపులకు గురి చేకూడదన్నారు. రుణగ్రహీతలు తీసుకున్న లోన్లు సకాలంలో చెల్లించకపోతే నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు. ఇటీవల పలు ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లపై పలు ఆరోపణలు వస్తున్నందున, ఆయా కంపెనీల ఉద్యోగులు తప్పకుండా చట్టబద్ధంగా నిబంధనలను పాటించాలన్నారు. రుణగ్రహీతలను ఎలాంటి వేధింపులకు గురి చేయరాదన్నారు. కంపెనీ ద్వారా లీగల్‌గా నోటీసుల అందజేసి కోర్టు జారీచేసే ఆదేశాల మేరకు నడుచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి రుణగ్రహీతలను ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు, సర్కిల్ సీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

పంట కాలువలోకి జారిపోయిన టిప్పర్



కారంచేడు: కారంచేడు - ఆదిపూడి రోడ్డులోకి రివర్స్ చేసుకోవడానికి తిరిగిన టిప్పర్ లారీ అదుపుతప్పి పంట కాలువలోకి జారిపోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోయినప్పటికీ విద్యుత్ స్తంభాలు, వైర్లకు నష్టం కలిగినట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది తెలిపారు. వాడరేవు - పిడుగురాళ్ల ప్రధాన రహదారి (167ఏ బైపాస్ రోడ్డు) పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులకు ఉపయోగించే టిప్పర్ లారీని డ్రైవరు ఈ రోడ్డులోకి తిప్పాడు. అదుపుతప్పడంతో అది రైతులు ఏర్పాటు చేసుకున్న పంపింగ్ స్కీమ్ వద్ద పంట కాలువలోకి జారిపోయింది. ఇదే సమయంలో అక్కడ ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌తో పాటు, విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయింది. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసిన సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాల్య వివాహం నిలిపివేత

నాదెండ్ల: బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకుని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చిన సంఘటన ఓ గ్రామంలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఈ ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసింది. చిలకలూరిపేట మండలం చినరాజాపేట గ్రామానికి చెందిన 22 ఏళ్ల నరేంద్రతో ఈ నెల 13న బాలిక వివాహాన్ని పెద్దలు నిర్ణయించారు. బాలిక తండ్రి చనిపోగా, తల్లి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. బాలిక వివాహ సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో స్వరూపారాణి, డీసీటీవో ప్రశాంత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, సచివాలయ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మూడో శనివారం స్వచ్ఛ దివస్ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్

కర్లపాలెం: ప్రతినెల మూడవ శనివారం గ్రామంలో స్వచ్ఛ దివస్ పాటించాలని స్వచ్ఛాంధ్ర ఫైనాన్స్ మేనేజర్ పి.విజయశేఖర్ తెలిపారు. విజయ్‌శేఖర్ గురువారం దమ్మనవారిపాలెం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాల వివరాలను సర్పంచ్ వెంకటేశ్వరమ్మను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కావల్సిన సామగ్రిని పంపిణీ చేస్తామని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. డీఎల్‌పీఓ కుమారస్వామి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సర్పంచ్ గురపుసాల వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాషా, పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు గురువారం 930 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 668 బస్తాలు రాగా కనిష్ఠ ధర రూ.10,300, గరిష్ఠ ధర రూ.12,425, మోడల్ ధర రూ.11,400 పలికినట్లు ఆయన పేర్కొన్నారు. కాయలు 262 బస్తాలు రాగా కనిష్ఠ ధర రూ.10,116, గరిష్ఠ ధర రూ.12,000, మోడల్ ధర రూ.11,401 పలికినట్లు తెలిపారు. మొత్తం 697.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలియజేశారు.

బొబ్బర్లంక ఎస్టీ కుటుంబాలకు న్యాయం చేయాలి

- ఎస్టీల క్రయవిక్రయాలకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టాలి
- సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మణిలాల్



స్థానికులతో మాట్లాడుతున్న మణిలాల్

రేపల్లె రూరల్: పశువుల మాదిరిగా ఎస్టీ కుటుంబాలకు చెందిన మనుషులను క్రయవిక్రయాలు జరిపి వారిచే వెట్టిచాకిరి చేయించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మణిలాల్ డిమాండ్ చేశారు. బొబ్బర్లంక ఎస్టీ కాలనీలో నిరాధరణకు గురై కట్టుబానిసలుగా పనిచేస్తున్న గిరిజనులను సీపీఎం, కేవీపీఎస్, ఐద్వా తదితర ప్రజాసంఘాల సభ్యులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎస్టీలను కట్టుబానిసలుగా చేసుకుని హింసలకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని చట్టాలు చేసినా ఇంకా బానిసత్వం ఉండటం శోచనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీలు సమాజంలో ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ కులవివక్షకు, దోపిడీకి, అన్యాయానికి గురవుతున్నారన్నారు. అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని శ్రమను దోచుకుని బానిసలుగా మార్చినవారిపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు దోపిడీకి గురైన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమార్కుల చెరలో బందీలుగా ఉన్న కుటుంబాలను విడిపించి ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల పరిహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు ప్రభుత్వం కల్పించిన హక్కులను వివరించారు. సీపీఎం, కేవీపీఎస్, ఐద్వా నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, డి.ఆగస్టిన్, కె.నాంచారమ్మ, జి.దానియేలు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న దాతలు

జె.పంగులూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం భోజనశాల ప్రారంభించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ఇంటరైజ్ వారు సంయుక్తంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకంలో భాగంగా రూ.15 లక్షలతో భోజనశాలను నిర్మించారు. బాల బాలికలు కూర్చొని భోజనం చేసేందుకు వీలుగా స్టీల్ బెంచీలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిలుగా సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే, ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, ఆపరేషన్స్ మేనేజర్ శ్రీ ఆనంద్, రౌండ్ టెబుల్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వెంకటేష్‌లు హాజరై భోజనశాలను ప్రారంభించారు. హెచ్ఎం ఇమ్మిడిశెట్టి అనిత మాట్లాడుతూ భోజనశాలలో 450 మంది విద్యార్థులు సౌకర్య వంతంగా భోజనం చేయవచ్చన్నారు. గ్రామ పెద్ద చింతల సహదేవుడు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గోలి సంధ్యారాణి, గ్రామ సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

కిరణ్ ఒక్కడే కాదు.. ఎందరో ఉన్నారు !

- ప్రతి ఒక్కరినీ శిక్షించాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి



తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నారాయణమూర్తి తదితరులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో కిరణ్‌లాంటి వాళ్లు ఎంతో మంది వైఎస్సార్ సీపీ మహిళా ప్రజా ప్రతినిధులు, మంత్రులు, మహిళల గురించి అసభ్యంగా మాట్లాడుతూ అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, వారందరినీ కూడా ప్రభుత్వం శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి డిమాండ్ చేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం చేబ్రోలు కిరణ్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ,ఆయన సతీమణి భారతిపై కిరణ్ చాలా అసభ్యకరంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. పోలీసులు ఆయనపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియా వేదికగా కొంతకాలం నుంచి వైఎస్సార్ సీపీ మహిళలపై, నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులపై అసభ్యకరంగా మార్ఫింగ్‌లు చేసి పోస్టులు పెడుతున్నారని తెలిపారు. కిరణ్‌పైనే కాకుండా మిగిలిన వారిపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మహిళలను కించపరిస్తే సహించమని తెలిపారు. , కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీల అధ్యక్షులు కొండమడుగుల సుధాకర్‌రెడ్డి, కొలుసు మోహన్ యాదవ్, కొండకాయల వంశీ, కృష్ణ, సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగ్గా 'చెత్త నుంచి సంపద సృష్టి'



మాట్లాడుతున్న ఈడీ అర్జునరావు

సత్తెనపల్లి: స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ఆశయ సాధనలో భాగంగా రాష్ట్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అర్జునరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామలోని ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, క్లాప్ మిత్రాలు పారిశుద్ధ్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తలను వేరు చేసి అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలని కోరారు. అనంతరం నందిగామ క్లాప్ మిత్రాలతో సమావేశమై, పలు సూచనలు చేశారు. గ్రామంలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు చెందిన స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్‌లతో ఈడీ భేటీ అయ్యారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఆర్.శ్రీనివాసరెడ్డి, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆళ్ళ సాంబయ్య, ఐటీసీ రీసోర్స్‌పర్సన్ చెంబేటి బొల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, ఏపీఎం సమాధానం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి 10 మందికి గాయాలు



తెనాలి రూరల్: కుక్కలను తప్పించబోయి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా 10 మంది గాయాలపాలయ్యారు. తెనాలి వైకుంఠపురం సమీపంలో గురువారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన ధర్మ, యాకోబు, బెంజమిన్, మరియమ్మ, శ్యామల, వెంకటరత్నం, అమ్మారావు, సుశీల, సైమాన్ రాయి పని కోసం తెనాలి మండలం కొలకలూరుకు కొద్ది రోజులుగా వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మూల్పూరుకే చెందిన ఆటో డ్రైవర్ మూల్పూరి నరేష్ ఆటోలో వీరు వస్తున్నారు. తెనాలి వైకుంఠపురం సమీపంలో రహదారిపై మూడు కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టడంతో అందులోని 10 మంది గాయపడ్డారు. 108లో వారిని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో యాకోబు పరిస్థితి విషమంగా ఉండంతో గుంటూరు పంపారు. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

సమాజ హితమే సాహిత్యం పరమావధి



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ సుబ్బారావు



డీఐజీ విజయారావుకు సత్కారం

తాడేపల్లి రూరల్: మాతృ భాషలు మృత భాషలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షింపబడాలని తెలిపారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బీఏ (ఐఎఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం ''ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదాలు - సమాలోచన'' అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావధి అని పేర్కొన్నారు. రాష్ట్ర రహదారుల భద్రతా విభాగం డీఐజీ సీహెచ్. విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించడం సులువని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ ప్రచురించిన 11 సంవత్సరాల యూపీఎస్సీ పాత ప్రశ్నపత్రాలు - సమాధానాలు, విశ్లేషణతో కూడిన గ్రంథాన్ని ఆవిష్కరించి, ఉచితంగా విద్యార్థులకు అందజేశారు. వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి. రాంబాబు మాట్లాడుతూ తెలుగు ప్రధాన అంశంగా తీసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత మార్గ నిర్దేశం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోలా విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, రచయిత్రి నైనాల వాణిశ్రీ , బీఏ విభాగాధిపతి బి. శివనాగయ్య, సహాయ ఆచార్యులు అద్దంకి ప్రజాపతి, వర్సిటీ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, కె. రాజశేఖరరావు, ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, బీఏ ఉప విభాగాధిపతి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

నగరంపాలెం: రాష్ట్రంలో గురువారం 17 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీ బి.వి. సుబ్బారావును ఏసీబీ డీఎస్పీగా, వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీగా బదిలీ చేశారు.